సాక్షి
సంగారెడ్డి
శనివారం । 2 । మార్చి । 2024



గంజాయి పట్టివేత

పటాన్‌చెరు, రామచంద్రాపురం పరిధిలో భారీగా గంజాయి పట్టుబడింది.

వివరాలు 8లో ▸



మల్లన్నా నీళ్లొచ్చేనా?

దుబ్బాకలో మల్లన్న సాగర్ కాల్వల నిర్మాణ పనులు వారం రోజులుగా నిలిచిపోయాయి.

వివరాలు 8లో ▸



కార్మికుల నిరసన

పెండింగ్ వేతనాలు చెల్లించాలని జహీరాబాద్‌లో మున్సిపల్ కార్మికులు నిరసన తెలిపారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

14 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించినట్లు పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం, గురువారం నిర్వహించిన ఈ డ్రైవ్‌లో 14 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. వారిని శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా, జడ్జి ఒక్కొక్కరికీ రూ.వెయ్యి జరిమాన విధించినట్లు పేర్కొన్నారు.

ఎంపీ ఎన్నికల్లో సత్తా చాటుదాం



పార్టీలో చేరుతున్న ఆనంద్‌కృష్ణారెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సత్తా చూపాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి పిలుపునిచ్చారు. మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధి బీఆర్ఎస్ నేత ఆనంద్‌కృష్ణారెడ్డి తోపాటు పలువురు నాయకులు శుక్రవారం బీజేపీలో చేరారు. వారికి గోదావరి కండువాలు కప్పి ఆహ్వానించారు.

బాలికల ఆరోగ్యంపై శ్రద్ధ



అవగాహన కల్పిస్తున్న అధికారులు

సంగారెడ్డి టౌన్: బాలికల ఆరోగ్యం పట్ల అశ్రద్ధ చూపొద్దని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి లలిత కుమారి అన్నారు. శుక్రవారం ఆ శాఖ ఆధ్వర్యంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మగ పిల్లలతో సమానంగా ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రేణుక, రత్న, పల్లవి, సునీత పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి



కూలీలతో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ జ్యోతి

మునిపల్లి(అందోల్): ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని డీఆర్‌డీఓ (జిల్లా గ్రామీణ అధికారి) జ్యోతి సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం మండలంలోని తాటిపల్లి, మన్‌సాన్‌పల్లి గ్రామాలలో ఉపాధి పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. అంతే కాకుండా నర్సరీలలో పెంచుతున్న మొక్కలను సంరక్షించాలని కోరారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయండి

జహీరాబాద్ టౌన్: ఈ నెల 3న జహీరాబాద్ డివిజన్‌లో నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర శంకర్ కోరారు. ఐదేళ్లలోపు పిల్లలందరికీ చుక్కలు వేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. న్యాల్‌కల్, బిలాల్‌పూర్, దిగ్వాల్, ఝరాసంగం, రాయికోడ్, మిర్జాపూర్, మొగుడంపల్లి, మల్‌చెల్మ, యూపీహెచ్‌సీ జహీరాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 34,384 మంది చిన్నారులను గుర్తించామన్నారు. 292 పోలియో బూత్‌లు, 11 ట్రాన్సిట్ బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. 9 మొబైల్ బృందాలు, 564 మంది ఏఎన్‌ఎం, ఆశావర్కర్లతో 2414 డోసులు వేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. 4, 5 తేదీల్లోనూ వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చుక్కలు వేస్తారన్నారు.

అడుగంటిన ఆశలు



బోరు నుంచి వస్తున్న సన్నని ధార

ఎండుతున్న పొలాలు

- వట్టిపోతున్న బోరుబావులు
- జంతువులతో పంటలు నాశనం
- ఆశలు వదులుకుంటున్న అన్నదాతలు

పంటలు వేశాక నీరు పాతాళంలోకి ఇంకిపోవడంతో అన్నదాతలు ఆశలు వదులుకుంటున్న దుస్థితి. భూగర్భజలాలు అడుగంటడంతో నీటి ఎద్దడి తీవ్రమవుతోంది. కోటి ఆశలతో పెట్టుబడులు పెట్టిన రైతన్నలు కంటతడి పెడుతున్నారు.

\- కంగ్టి(నారాయణఖేడ్)

సదాశివపేట మండలంలో భూగర్భ జలాలు దాదాపు 11మీటర్ల లోతుకు పడిపోయాయి. గత ఏడాదితో పోలిస్తే చాలా ఎక్కువ స్థాయేనని చెపుతున్నారు అధికారులు. చాలా చోట్ల పంటలకు నీరు అందడంలేదు. రైతులు నష్టపోయే పరిస్థితి దాపురించింది. సీజన్‌లో వర్షాలు సరిగా కురవక పోవడంతో ప్రస్తుతం నీటి ఎద్దడి మొదలైనట్లు భావిస్తున్నారు. సదాశివపేట్ మండలంలో 2023 జనవరి చివరి నాటికి 8.68మీటర్ల లోతులో ఉన్న నీరు ఈ ఏడు 19.43మీటర్లకు చేరుకొంది. అంటే 10.75మీటర్ల లోతుకు దిగిపోయింది. గత ఏడాదితో పోలిస్తే ఆయా మండలాల్లోని నీటి స్థాయిలు బాగా తగ్గాయి. జహీరాబాద్‌లో 9.60 మీటర్లు, రాంచంద్రాపురంలో 9.44 మీటర్లు, నాల్కల్‌లో 7.83 మీటర్లు, కంగ్టిలో 7.82మీటర్లు, మొగుడంపల్లిలో 7.26 కాగా కంది మండలంలో 6.92 మీటర్లు లోతులోకి జలాలు దిగిపోయాయి.

యాసంగి పంటలు.

నారాయణఖేడ్ డివిజన్‌లోని అన్ని మండలాల్లో భూగర్భ జలాలు అడుగంటుతుండడంతో రైతులు వేసిన జొన్న, మొక్కజొన్న, మిరప, ఉల్లి, గోధుమ, వేరుశనగ, పొద్దుతిరుగుడు, వరి తదితర పంటలకు నీరు అందే పరిస్థితి లేదు. గత యాసంగిలో 61,312 ఎకరాలు పంటలు వేయగా వరి 20,741 ఎకరాలు, జొన్నలు 33,964 ఎకరాలు, శనగ 3,777 ఎకరాలు, మొక్కజొన్న 1,444 ఎకరాలు సాగుచేసినట్టు వ్యవసాయ గణాంకాలు చెబుతున్నాయి. వేసవి ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతుండడంతో వారం రోజుల్లో పంటలు వాడిపోయాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎండిన వాగులు, ఇంకిన బావులు

చెరువుల్లో నీరు పుష్కలంగా ఉండడంతో వాగుల పక్కన ఉన్న రైతులు జొన్న, మొక్కజొన్న పంటలు వేశారు. కాగా వాగుల్లో నీరు ఈ ఏడు జనవరిలోనే ఎండి పోవడంతో పంట నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. బోరుబావుల్లో ఏటా మార్చి రెండో వారంలో నీరు తగ్గుతుండగా ఈ ఏడు ఫిబ్రవరి రెండో వారంలోనే నీటి ఎద్దడి మొదలైందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

పంటలు ఎండుతున్నాయి..



బోరు బావులపై ఆశలు పెట్టుకొని పంటలు వేశాం. మార్చి చివరి వరకు నీరందించే బోర్లు ఇప్పుడే అడుగంటడంతో పంటలపై ఆశ లేకుండా పోతుంది. కొత్తగా బోర్లు వేసినా నీరు పడడం లేదు. పెట్టుబడులు పెట్టి నష్టపోవల్సివస్తుందని ఆందోళన చెందుతున్నాం. ఈ వారం, పది రోజుల్లో వర్షాలు కురిస్తే బాగుంటుందని ఎదురుచూస్తున్నాం.

\- మైపాల్‌రెడ్డి, రైతు, బాన్సువాడ కంగ్టి మండలం

ఉచిత శిక్షణ

నారాయణఖేడ్: సంగారెడ్డి పట్టణంలో అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సులో 90 రోజుల ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఖేడ్ శిక్షణకేంద్రం ఇన్‌చార్జీ నగేష్ తెలిపారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఇచ్చే ఈ శిక్షణకు 10వ తరగతి ఉత్తీర్ణులై 18 నుంచి 33 ఏళ్ల వయస్సు గలవారు అర్హులని చెప్పారు. ట్రైనింగ్‌లో ఉచిత భోజన, వసతి, యూనిఫాం, షూ, హెల్మెట్, స్టేషనరీ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కోర్సు పూర్తయిన తర్వాత సర్టిఫికెట్ తోపాటు ప్రైవేటుసంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు వివరించారు. ఈనెల 4వ తేదీ లోపు సంగారెడ్డిలోని ప్రభుత్వ ఐటీఐ క్యాంపస్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 7780791531 నంబరులో సంప్రదించాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి టౌన్: బోయిన్‌పల్లి బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ప్రారంభమైన వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశం పొందడానికి గిరిజన బాల, బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఫిరంగి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు 5వ తరగతి ప్రవేశానికి ఈ నెల 4వ తేదీ వరకు సంగారెడ్డిలోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఎత్తు, బరువు, స్టాండింగ్ బ్రాడ్ జంప్, వర్టికల్ జంప్, మెడిసిన్ బాల్ త్రో, 30మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్ 800మీటర్ల పరుగు పందెం పోటీలు నిర్వహించి ఎంపిక చేస్తారని చెప్పారు. ఇంగ్లీష్ మీడియంలో 10మంది బాలికలకు,10 మంది బాలురకు ప్రవేశాలు కల్పిస్తారన్నారు.

చెరకు సాగుపై అవగాహన



పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త విజయ్‌కుమార్

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని హుస్సెల్లి గ్రామంలో శుక్రవారం బసంత్‌పూర్ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త విజయ్‌కుమార్ చెరకు సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. నూతనంగా ఏర్పాటు కానున్న చక్కెర ఫ్యాక్టరీ యాజమాన్యంతో కలిసి ఆయన చెరకు పంటలను కలసి పరిశీంచారు. ఈ సందర్భంగా అధిక దిగుడుల కోసం పాటించాల్సిన విధానాల గురించి వివరించారు.

మోదీ బహిరంగ సభకు ఏర్పాట్లు



పటాన్‌చెరులో మోదీ సభ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి, ఎస్పీ రూపేష్

పటాన్‌చెరు: పటాన్‌చెరు శివారులోని పటేల్‌గూడ సమీపంలో ఈనెల 5వ తేదీన ప్రధాని మోదీ బహిరంగ సభ నిర్వహించేందుకు అనువైన స్థలాన్ని శుక్రవారం కలెక్టర్ క్రాంతి, ఎస్పీ రూపేష్ పరిశీలించారు. వీరివెంట బీజేపీ మెదక్ పార్లమెంట్ ప్రభారి బసవ లక్ష్మయ్య, పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి ఉన్నారు.

'స్వీప్' ద్వారా ఓటింగ్‌పై అవగాహన

సంగారెడ్డి టౌన్: 'స్వీప్' కార్యక్రమం ద్వారా ఓటింగ్ పై అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ క్రాంతి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతీ శుక్రవారం హేతుబద్ధీకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఓటరు జాబితాలో ఏమైనా తప్పులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిశీలించి సరి చేస్తామన్నారు. పోలింగ్ కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. శుభకార్యాల కోసం తీసుకెళ్లే నగదు పట్టుకుంటే వెంటనే ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టుబడిన నగదు జిల్లా ఎన్నికల గ్రీవెన్స్ అందిస్తామని, సరైన పత్రాలు చూపించి తీసుకువెళ్లవచ్చని పేర్కొన్నారు.

త్వరలో ప్రజాపాలన సేవా కేంద్రాలు

త్వరలో ప్రజాపాలన సేవా కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. మున్సిపాలిటీ, ఎంపీడీఓ కార్యాలయాల్లో వీటిని ఏర్పాటు చేస్తామని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో మాట్లాడారు. ఇంటర్, టెన్త్ పరీక్షలు, ప్రజాపాలన దరఖాస్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అన్ని పని దినాల్లో ప్రజాపాలన సేవా కేంద్రాలు కొనసాగుతాయని వివరించారు. ఆయా కేంద్రాల్లో ఒక అధికారి, ఆపరేటర్ ఉండేలా చూస్తున్నామని తెలిపారు. కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు కల్పిస్తామన్నారు. టెన్త్, ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థుల అవగాహన

సంగారెడ్డి: ప్రతి ఒక్కరూ డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు తోడ్పడాలని డీఎంఏ డాక్టర్ వాణి పిలుపునిచ్చారు. శుక్రవారం సంగారెడ్డి మెడికల్ కళాశాల విద్యార్థులు స్థానిక ఐబీ ఎదుట ప్రదర్శనలు నిర్వహించారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కలెక్టర్ క్రాంతి హాజరై తిలకించారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ సుధ, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ అనిల్ కుమార్, ఆర్‌ఎంఓలు ఆంజనేయులు, రవి కుమార్ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ఎమ్మెల్యే సంజీవరెడ్డి



రేడియాలజీ టీ-హబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): విద్యార్థులకు ఇలాంటి భోజనమా పెట్టేది అని ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం నిజాంపేట మండలం బాచేపల్లిలో మహత్మ జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. గురుకులం నిర్వహణ సరిగా లేదని బాగ లేదని స్థానికులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయడంపై ఆరా తీశారు. పనితీరు మార్చుకోవాలని ప్రిన్సిపాల్ పద్మావతికి సూచించారు. పిల్లలకు నాణ్యమైన భోజనం పెట్టాలని ఆదేశించారు. అంతకుముందు బాచేపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీఎస్‌సీ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. బాచేపల్లి, మీర్జాన్‌పేట, కల్వనికుంట తండా, ఖానాపూర్(బి), తదితర చోట్ల సీసీ రోడ్ల నిర్మాణం పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీఓ తుమ్మ ప్రసాద్, శంకర్‌గౌడ్, బుర్గుల పోచయ్య, గోపాల్, ప్రవీన్‌గౌడ్, శ్రీకాంత్, వీర్‌షెట్టి పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు

నారాయణఖేడ్: ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆస్పత్రిలో రేడియాలజీ టీ-హబ్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యతనిస్తోందన్నారు. సీఎం, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సహకారంతో ఆస్పత్రిలో సదుపాయాలు కల్పిస్తామన్నారు. సూపరింటెండెంట్ వెంకటలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్లు వివేకానంద్, మాజీద్ పాల్గొన్నారు.

గృహజ్యోతి వెలుగులు ప్రారంభం

- జిల్లాలో జీరో బిల్లులు అందజేసిన అధికారులు
- హర్షం వ్యక్తం చేసిన లబ్ధిదారులు
- మొత్తం కనెక్షన్లు: 3లక్షల 78 వేలు



మంజీరా నగర్‌లో జీరో బిల్లు అందిస్తున్న విద్యుత్ జిల్లా అధికారులు

సంగారెడ్డి: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో మూడవది అయిన గృహజ్యోతి పథకం జిల్లాలో విద్యుత్ అధికారులు శుక్రవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా పటాన్‌చెరులో ఎస్‌ఈ మాధవరెడ్డి, సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని మంజీరానగర్‌లో డీఈ సురేందర్‌రెడ్డి జీరో బిల్లులు అందించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ ప్రతీ నెల 200 యూనిట్ల వరకు ఉచితంగా అర్హులైన ప్రతి కుటుంబానికి విద్యుత్ సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపారు. సంగారెడ్డిలో ఒక్క రోజే 800మందికి జీరో బిల్లు అందించినట్లు చెప్పారు. జిల్లాలో మొత్తం మూడు లక్షల78 వేల కనెక్షన్లు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు శ్రీనివాస్, సునీత, సిబ్బంది రాజేష్ పాల్గొన్నారు.

తీరనున్న వ్యాపారుల తిప్పలు

- ఇంటిగ్రేటెడ్ దుకాణ సముదాయ సమస్యకు పరిష్కారం
- అద్దెదారులకు కేటాయించేందుకు అధికారుల కార్యాచరణ
- అగ్రిమెంట్లు, డిపాజిట్ సొమ్ము సేకరణ



ఇంటిగ్రేటెడ్ దుకాణాల సముదాయం

జహీరాబాద్: పట్టణంలో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ దుకాణాల సముదాయం బిల్లుల బకాయిలను సదరు కాంట్రాక్టర్‌కు చెల్లించేందుకు ప్రభుత్వం హామీ ఇవ్వడంతో కేటాయింపుల ప్రక్రియ వేగవంతం చేశారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మార్కెట్‌యార్డులో అలాట్ చేసిన వ్యాపారులకు కేటాయించేందుకు వీలుగా అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. రూ.10 కోట్ల వ్యయంతో ఈ దుకాణ సముదాయాన్ని నిర్మించారు. 2022 డిసెంబర్ 27వ తేదీన దుకాణాల సముదాయాన్ని అప్పటి మంత్రి హరీశ్ ప్రారంభించారు. పనులు పూర్తి చేసినా కాంట్రాక్టర్‌కు రావాల్సిన రూ.4.50కోట్లు పెండింగ్‌లో పెట్టారు. దీంతో అతను మార్కెట్ సముదాయానికి తాళాలు వేశాడు. దీంతో అప్పట్లో అగ్రిమెంట్లు నిలిచి పోయాయి. తదనంతరం ఎన్నికలు రావడం, రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారం కోల్పోవడంతో కేటాయింపుల్లో తీవ్ర జాప్యం జరిగింది. ఇటీవల జహీరాబాద్ సమీక్ష సమావేశానికి వచ్చిన మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి ఈ సమస్యను తీసుకువచ్చారు. ఆయన స్పందించి కాంట్రాక్టర్‌తో మాట్లాడి బకాయిలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇందుకు కాంట్రాక్టర్ జావేద్ సమ్మతించి అక్కడే ఉన్న కలెక్టర్ వల్లూరి క్రాంతికి తాళాలు అప్పగించాడు. కేటాయింపు ప్రక్రియ వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని కలెక్టర్ ఆదేశించింది. దీంతో వారు దుకాణాల కేటాంపుల పనిలో నిమగ్నమయ్యారు. దీంతో 14 నెలలగా ఉన్న సమస్య కొలిక్కి వచ్చింది. దుకాణాల సముదాయంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో 84 దుకాణాలను కూరగాయలు, పండ్లు, పూలు, నాన్ వెజ్ విక్రయాల కోసం కేటాయించారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో 33, మొదటి అంతస్తులో 34 దుకాణాలు ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీ, డ్వాక్రా సంఘాలు, నాయీ బ్రాహ్మణులకు, పాత వారికి సంబంధించి 26 దుకాణాలను రిజర్వు కేటగిరీ కిందకు చేర్చి.. మిగతా వాటిని జనరల్ కోటా కింద ఖరారు చేశారు. ఇప్పటి వరకు 26 దుకాణాల వేలం పాట పూర్తయ్యింది. మిగతా వాటిని వేలం వేసేందుకు అధికారులు సిద్ధం చేస్తున్నారు. వేలం పాటల్లో కేటాయించిన దుకాణాలకు రూ.2,500 మొదలు కుని రూ.66వేల వరకు నెలసరి అద్దెకు పాటపాడి దక్కించుకున్నారు. దుకాణాల సముదాయం 65వ జాతీయ రహదారిపై ఉండడంతో దుకాణాలను దక్కించుకునేందుకు వ్యాపారులు ఆసక్తి చూపుతున్నారు.

అగ్రిమెంట్లు తీసుకుంటాం



దుకాణాల కేటాయింపులు పొందిన వ్యాపారుల నుంచి అగ్రిమెంట్లు రాయించుకుంటాం. 6నెలలకు సంబంధించిన అద్దెలను డిపాజిట్ల కింద తీసుకుంటాం. మిగిలిన దుకాణాలకు కూడా వేలం నిర్వహిస్తాం. రహదారిపై నిర్వహిస్తున్న కూగాయల అమ్మకాలను సెల్యూలార్‌లోకి తరలిస్తాం.

\-జి.శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్

పట్టు తప్పితే ప్రమాదమే..

సంగారెడ్డి పట్టణంలో కొందరు ప్రమాదకర ప్రయాణం చేస్తున్నారు. గూడ్స్ వాహనాలు, ట్రాక్టర్లలో వివిధ వస్తువులను తరలించే క్రమంలో ఎలాంటి ఆధారం లేకుండా వేలాడుతూ.. నిలబడి వెళ్తున్నారు. వాహనాలు వేగంగా వెళ్లే క్రమంలో పట్టు తప్పితే ప్రమాదమని తెలిసినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. - సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి



ఇల్లు ఖాళీ చేస్తూ వాహనం పై..



స్లాబ్ బాక్సులు తరలించే వాహనం పై..



టెంట్ హౌస్ సామాన్ తరలించే వాహనం పై..



ఇనుప రాడ్లను తరలించే వాహనం పై..

శివరాత్రికి భారీ భస్మ లింగం



కరపత్రాలను విడుదల చేసిన మహేశ్వర శర్మ సిద్ధాంతి

సంగారెడ్డి టౌన్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండల పరిధి ఫసల్ వాదిలోని శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో 20.6 అడుగుల భారీ భస్మలింగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు విద్యాపీఠం స్థాపకులు బ్రహ్మశ్రీ డాక్టర్ మహేశ్వర శర్మ సిద్ధాంతి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రెండేళ్లుగా వివిధ రూపాలలో లింగం తయారు చేసి భక్తులకు దర్శనం కల్పిస్తున్నామని, ఈ ఏడాది కూడా ఆశ్రమంలో 12 టన్నుల భారీ భస్మ లింగాన్ని తయారు చేస్తున్నారని చెప్పారు. ఇందుకోసం కాశీలోని 39 ఘాట్లలో, అరుణాచలం వివిధ పుణ్యక్షేత్రాల నుంచి భస్మాని సేకరించామని తెలిపారు. ఈ నెల 5వ తేదీన భస్మలింగాన్ని ఆవిష్కరిస్తామన్నారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో విద్యాపీఠం సభ్యులు ప్రశాంత్ కుమార్, సంజయ్, లక్ష్మీనారాయణ, సత్యనారాయణ, సాయినాథ్, నరేష్ కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

తండ్రిని చంపిన తనయుడు

- తాగొద్దని మందలించినందుకు ఘాతుకం


చంద్రయ్య(ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): కన్న కొడుకే తండ్రిని హత్య చేసిన ఘటన మనోహరాబాద్ మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కూచారం గ్రామానికి చెందిన బోంతపల్లి చంద్రయ్య (48), నర్సమ్మ దంపతులకు ఒక్కడే కుమారుడు ప్రశాంత్ ఉన్నారు. ప్రశాంత్ నిత్యం తాగుడుకు బానిసై జులాయిగా తిరుగుతుండేవాడు. తండ్రి చంద్రయ్య కుమారుడిని రోజూ తాగొద్దని మందలిస్తుండేవాడు. ఈ క్రమంలో గురువారం సైతం తండ్రి కొడుకులకు ఇంట్లో ఫ్యాన్ విషయంలో గొడవ జరిగింది. దీంతో కోపానికి గురైన ప్రశాంత్ గొడ్డలి కామతో తండ్రి తలపై కొట్టాడు. తీవ్ర గాయాలు కావడంతో చంద్రయ్యను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని గాంధీకి తీసుకెళ్లాని వైద్యులు సూచించారు. కానీ వారు కూచారంలో ఇంటికి వెళ్లారు. రాత్రి 11 గంటలకు ఇంట్లోనే చంద్రయ్య మృతి చెందాడు. మృతుడి భార్య నర్సమ్మ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

చింతకాయలు తెంపుతూ..

- చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి


మల్లేశం(ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): చెట్టుపై నుంచి పడి యువకుడు మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నార్సింగి మండలం శేరిపల్లి గ్రామానికి చెందిన బండారు మల్లేశం(40) గ్రామంలో చింత చెట్టు పైకి ఎక్కి చింతకాయలు తెంపుతున్నాడు. ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడిపోయాడు. వెంటనే నార్సింగిలోని ఓ ఆస్పత్రికి తరలించగా అప్పటికి మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. మృతుడికి భార్య నాగరాణి, కుమారుడు, కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నార్సింగి ఎస్ఐ అమ్మద్ మోహినొద్దీన్ తెలిపారు.

వ్యక్తి దారుణ హత్య


దుర్గేశ్(ఫైల్)

నర్సాపూర్ రూరల్: వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన నర్సాపూర్ మండలం చిప్పల్‌తుర్తి అటవీ ప్రాంతంలో శుక్రవారం చోటు చేసుకుంది. నర్సాపూర్ సీఐ జాన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామానికి చెందిన దుర్గేశ్ అలియాస్ దుర్గయ్య (29) గురువారం ఉదయం సెల్ ఫోన్ రిపేర్ కోసం వేరే గ్రామానికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడు. రాత్రి అయినా దుర్గయ్య ఇంటికి రాలేదు. శుక్రవారం ఉదయం చిప్పల్ తుర్తి అటవీ ప్రాంతంలో స్థానికులకు శవమై కనిపించాడు. వెంటనే వారు గ్రామస్తులు, పోలీసులకు సమాచారం అందించారు. సీఐతోపాటు సిబ్బంది వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఆధారాలతో గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఎవరైనా దుర్గయ్యను ఇక్కడికి తీసుకొచ్చి హత్య చేశారా.. లేదా వేరే ప్రాంతంలో హత్య చేసి ఇక్కడ పడేశారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మల్లన్నా.. నీళ్లొచ్చేనా!

మళ్లీ ఆగిన మల్లన్నసాగర్ పంట కాల్వల నిర్మాణం

మలన్నసాగర్ ప్రాజెక్టు నుంచి పంట కాల్వల నిర్మాణం పనులు మళ్లీ మొదటికొచ్చాయి. సాగర్ నుంచి చెరువులు, కుంటలు, పంట పొలాలకు నీరందించేందుకు నిర్మిస్తున్న కాల్వల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు అనుసంధానంలో భాగంగా 50 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన మల్లన్నసాగర్ పూర్తయ్యి మూడేళ్లు అయినా ఇంకా పూర్తి స్థాయిలో పంటలకు నీరందడం లేదు. ప్రధాన కాల్వ పూర్తి అయినా పంట కాల్వల నిర్మాణం పూర్తి కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చాలా చోట్ల భూ సేకరణ సమస్య, అటవీ భూముల్లో కాల్వలకు అనుమతి రాకపోవడంతో నాలుగేళ్లుగా నిర్మాణాలు కొనసాగుతూ వస్తున్నాయి. – దుబ్బాకటౌన్


మల్లాయిపల్లి వద్ద అసంపూర్తిగా నిలిచిపోయిన మల్లన్న సాగర్ కాల్వ నిర్మాణం పనులు

- నాలుగు రోజులుగా నిలిచిపోయిన పనులు
- యాసంగికి నీళ్లొస్తాయనుకుంటే నిరాశే..
- ఎండుముఖం పడుతున్న పంటలు
- ఆందోళన చెందుతున్న రైతులు

మల్లన్న సాగర్ పంట కాల్వల నిర్మాణాలు వారం రోజులుగా నిలిచిపోయాయి. దుబ్బాక పట్టణంలోని ముస్తాబాద్ వెళ్లే మార్గంలో ఉన్న కాలువ నిర్మాణం కేవలం 200 మీటర్లు పెండింగ్‌లో ఉంది. ఈ కాల్వ పూర్తి అయితే దుబ్బాక పెద్ద చెరువు, ధర్మాజీపేట చెరువులు, మల్లాయపల్లి, చెల్లాపూర్, చీకోడ్, ఆరపల్లి, అచ్చుమాయపల్లి, పోతారం, గంభీర్ పూర్, శీలాజీనగర్, వెంకటగిరి తండాతోపాటు చాలా గ్రామాల చెరువులు నింపొచ్చు. తద్వారా సుమారుగా 5 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించవచ్చు. ఈ కాల్వల నిర్మాణం పూర్తి చేయాలని రైతులు ఒత్తిడి తేవడంతో 20 రోజులపాటు పనులు జరిగాయి. కానీ మళ్లీ వారం రోజులుగా పనులు నిలిచిపోయాయి. ఎందుకు నిలిపివేశారని రైతులు వెళ్లి అడిగితే పైనుంచి పనులు ఆపాలని ఆదేశాలు వచ్చాయని అధికారులు చెప్పుకొచ్చారు. దాదాపు 8 పంట కాల్వల పరిస్థితి ఇలానే ఉందని రైతులు చెబుతున్నారు. యాసంగి పంటలకు నీళ్లు రాకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రధాన కాల్వ మాత్రమే పూర్తి..

- ప్రధాన కాల్వల గుండా 20 రోజుల కిందటే నీరు వదలడంతో దుబ్బాక, సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాలతోపాటుగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ముస్తాబాద్ మండలంలోని మొత్తం 57 ప్రధాన చెరువులు నింపుతున్నారు. కూడవెల్లి, హల్దీ వాగులకు సైతం నీరు వదలడంతో జలకళ సంతరించుకున్నాయి.

సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌ను కలిసిన ఎమ్మెల్యే

- పెండింగ్‌లో ఉన్న మల్లన్నసాగర్ కాలువల నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని నెల రోజుల కిందట కలిసి విన్నవించారు. అసెంబ్లీ సమావేశాల్లో సైతం మల్లన్నసాగర్ కాల్వలు పూర్తి చేసి పంటలు కాపాడాలంటూ ఎమ్మెల్యే కోరారు. వెంటనే 20 రోజులుగా కాల్వల నిర్మాణాలు కొద్ది కొద్దిగా జరిగాయి. కానీ వారం రోజులుగా పనులు నిలిచిపోయాయి.

రైతుల ఆందోళన

- యాసంగిలో కాల్వల ద్వారా నీరందుతుందనే ఆశతో పంటలు వేసుకున్నామని తీరా కాల్వలు పూర్తి కాక పంటలకు నీరందకపోవడంతో ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్వాల పూర్తి అయితే వేల ఎకరాలకు నీరందే అవకాశం ఉంటుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాల్వలు త్వరగా పూర్తి చేసి నీళ్లొదిలి పంటలు కాపాడాలంటూ రైతులు వేడుకుంటున్నారు.

పనులు మళ్లీ ఆగిపోయాయి



వారం రోజులుగా కాల్వ నిర్మాణ పనులు ఆగిపోవడంతో రైతులమంతా అక్కడికి వెళ్లి అడిగితే పైనుంచి బంద్ చేయాలని ఆదేశాలు వచ్చాయని చెబుతున్నారు. కాల్వ నిర్మాణం పూర్తి అయి పంటలకు నీళ్లొస్తాయనే ఆశతో యాసంగిలో పంటలు వేసుకున్నామని తీరా పనులు బంద్ కావడంతో తమ పంటలు ఎండిపోయే పరిస్థితి దాపురించింది. ప్రభుత్వం, అధికారులు స్పందించి కాల్వ నిర్మాణ పనులు ప్రారంభించి తొందరగా పూర్తి చేసి పంటలు కాపాడాలి.
– పాతూరి అంజిరెడ్డి, రైతు దుబ్బాక

పూర్తి చేయించేందుకు కృషి చేస్తా



పెండింగ్‌లో ఉన్న మల్లన్న సాగర్ కాల్వల నిర్మాణం పూర్తి చేసి రైతుల పంటలు కాపాడాలనే ఆలోచనతోనే గెలిచినప్పటి నుంచి కృషి చేస్తున్నా. పంట కాల్వల నిర్మాణం కోసం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి వెంటనే చర్యలు తీసుకోవాలని విన్నవించడం జరిగింది. అసెంబ్లీ సమావేశాల్లో సైతం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాను. పెండింగ్ కాల్వలు పూర్తి చేసేందుకు శాయాశక్తుల కృషి చేస్తా. రైతులు ఆందోళన చెందొద్దు.
– ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి


మాట్లాడుతున్న సీపీ అనురాధ

సైబర్ వారియర్స్ కీలకపాత్ర వహించాలి

- సిద్దిపేట సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: సైబర్ నేరాల నియంత్రణలో సైబర్ వారియర్స్ కీలకపాత్ర వహించాలని సిద్దిపేట పోలీసు కమిషనర్ అనురాధ తెలిపారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో సైబర్ వారియర్స్ సిబ్బందికి సైబర్ నివారణపై శుక్రవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. సైబర్ నేరాల నియంత్రణ, ఫ్రీజ్ అయిన డబ్బులు బాధితులకు అప్పగించడంలో సిద్దిపేట పోలీసు కమిషనరేట్ రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచినందుకు సైబర్ వారియర్స్‌ను సీపీ అభినందించారు. ప్రజలు, యువత సైబర్ నేరాల బారిన పడకుండా పోలీసు స్టేషన్ల పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఫ్రీజ్ అయిన డబ్బులు సంబంధిత బాధితులకు అందేలా బ్యాంకు అధికారులతో కీలకంగా వ్యవహరించాలన్నారు. డబ్బులు అందిన వారిని గుర్తించి మెగా లోక్ అదాలత్‌లో కేసులు డిస్పోజల్ చేయించాలని సూచించారు. పెండింగ్ ఉన్న దరఖాస్తులను వారం రోజుల్లో డిస్పోజల్ చేయాలన్నారు. సైబర్ వారియర్స్ వారి విధులపై పూర్తిగా అవగాహనతో ఉండి విధి నిర్వహణలో ముందుకెళ్లాలని అన్నారు. సైబర్ నేరానికి సంబంధించి దరఖాస్తు రాగానే వెంటనే స్పందించి కేసు నమోదు చేయాలన్నారు. సైబర్ నేరాలపై వచ్చే ఫిర్యాదులపై ఎన్‌సీఆర్‌పీ, సైకాప్స్ పోర్టల్ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సైబర్ వారియర్స్‌కు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సైబర్ సెల్ పోలీస్ స్టేషన్ ఏసీపీ శ్రీనివాస్, సీఐ శేఖర్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి, శ్రీధర్, నరేందర్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఏరువాకా సాగారో అంటూ.. సన్నివేశంలో విద్యార్థులు

అబ్బురం.. సదేశాత్మకం


విద్యార్థులతో ఉపాధ్యాయులు

వర్గల్(గజ్వేల్): వర్గల్ మండలం తున్కిఖాల్సా ప్రాథమిక పాఠశాలలో గురువారం రాత్రి విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అబ్బురపరిచాయి. దేశానికి వెన్నెముక, ఆహార కొరత తీర్చే అన్నదాతగా క్షేత్రస్థాయిలో తమ కుటుంబాలతో కలిసి ఏరువాకా సాగారోరన్న రైతన్న అంటూ.. చెమటోడ్చే రైతుల గాథ, రామాయణం, ప్రభుత్వ పాఠశాలల గొప్పతనం, తదితర ప్రతిబింబించే విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎంఈఓ సునీత విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణమోహన్ రావు, పీ.నాగరాజు, పులి రాజు, మంజుల, విమల శిరీష, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇనుప పిల్లర్లు మీద పడి వ్యక్తి మృతి


రంజాన్ షేక్

పటాన్‌చెరుటౌన్: ఇనుప పిల్లర్లు మీద పడి వ్యక్తి మృతి చెందని ఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి కథనం ప్రకారం.. పశ్చిమ బెంగాల్ నాదియా జిల్లాకు చెందిన రంజాన్ షేక్(19) బతుకుదెరువు కోసం 15 రోజుల కిందట పటాన్‌చెరుకు వచ్చాడు. పాశమైలారంలో కేఎల్ఆర్ కన్‌స్ట్రక్షన్ వద్ద రోజువారి కూలీగా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం లారీలో వచ్చిన ఇనుప రాడ్ల లోడ్‌ను గ్రీన్ సహకారంతో కిందకు దింపే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు రంజాన్ షేక్‌పై పడ్డాయి. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉగాండ నుంచి స్వగ్రామానికి మృతదేహం


కరుణాకర్ రెడ్డి (ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): ఉపాధి కోసం ఉగాండ వెళ్లిన యువకుడు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకోగా మృతదేహం గురువారం నార్సింగి మండల కేంద్రానికి చేరుకుంది. నార్సింగి మండల కేంద్రానికి చెందిన తమ్మారెడ్డి లక్ష్మారెడ్డి కుమారుడు కరుణాకర్ రెడ్డి (40) ఉపాధి కోసం ఏడాది కిందట ఉగాండ దేశం వెళ్లాడు. అక్కడ సుడన్ ఎక్స్పోర్ట్ కంపెనీలో పని చేస్తూ ఫిబ్రవరి 26న ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కరుణాకర్ మిత్రులు సమాచారం అందించగా, కుటుంబ సభ్యులు తెలంగాణ వలస కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పీ.సాఘెందర్ ని సంప్రదించారు. ఆయన ఉగాండ నుంచి మృతదేహాన్ని స్వదేశానికి రప్పించగా నార్సింగిలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య లావణ్య, కుమారుడు భాను ప్రసాద్ రెడ్డి (10), కూతురు భాను ప్రియా(12) ఉన్నారు.

ఎమ్మెల్యే రోడ్డు ప్రమాద కేసులో..

టిప్పర్‌ను గుర్తించిన పోలీసులు


పోలీసుల అదుపులో టిప్పర్ లారీ

పటాన్‌చెరుటౌన్: కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత కారు ప్రమాదానికి సంబంధించిన కేసులో పోలీసులు టిప్పర్‌ను గుర్తించారు. గత నెల 23వ తేదీన ఎమ్మెల్యే కారు నడపుతున్న డ్రైవర్ ఆకాశ్ నిద్రమత్తులో ముందుకు వెళ్తున్న టిప్పర్‌ను బలంగా వెనుక నుంచి ఢీకొట్టి అనంతరం ఓఆర్ఆర్ రైయిలింగ్ ఢీకొట్టడంతో లాస్య నందిత మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే, తెల్లవారుజాము సమయం కావడంతో వీరు ఢీకొన్న టిప్పర్‌ను పోలీసులు గుర్తించలేకపోయారు. సీసీ ఫుటేజీ ఆధారంగా ప్రమాదం జరిగిన సమయంలో ఏఏ వాహనాలు వెళ్లాయో గుర్తించి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. వాటిని నడిపిన డ్రైవర్లను విచారించారు. చివరకు టీఎస్ 08 యూజే 0025 అనే నంబరు గల టిప్పర్ ను ఎమ్మెల్యే వాహనం ఢీకొన్నట్లుగా గుర్తించారు. ఈ టిప్పర్ వెనుక భాగంలో ఉన్న సిగ్నల్ లైటు బోర్డు పగిలిపోగా, పై భాగంలో ఉన్న గార్డు లాంటి ఇనుప భాగం పక్కకు వంగిపోయింది. దీన్ని గుర్తించిన పోలీసులు విచారణలో భాగంగా డ్రైవర్ ను గుర్తించి అతన్ని పూర్తిస్థాయిలో విచారిస్తున్నారు. దీనిపై ప్రస్తుతం వివరాలు వెల్లడించలేమని త్వరలోనే జిల్లా ఎస్పీ వెల్లడిస్తారని డీఎస్పీ రవీందర్ రెడ్డి తెలిపారు.

తప్పుడు ప్రచారాలు సహించం

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి గోపికృష్ణ


కార్యకర్తలతో మాట్లాడుతున్న గోపికృష్ణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీపై అసత్య ప్రచారాలు చేస్తే సహించేది లేదని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పూజల గోపికృష్ణ అన్నారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో గోపికృష్ణ మాట్లాడుతూ.. పార్టీ ప్రవేశపెట్టిన పథకాలపై తప్పుడు ప్రచారం చేస్తే యూత్ కాంగ్రెస్ నేతలు తరిమికొట్టాలన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపే దిశగా కార్యకర్తలు పని చేయాలన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ పార్టీ చేయని పని కేవలం 2 నెలలో కాంగ్రెస్ చేసి చూపించిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట తప్పకుండా అమలు చేస్తారన్నారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ కార్యకర్తలు చేసిన అక్రమాలను త్వరలోనే యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బయటపెట్టి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అసెంబ్లీ నియోజకవర్గంలో బూత్ స్థాయి నుంచి అసెంబ్లీ స్థాయి వరకు అన్ని కమిటీలు వేస్తున్నామన్నారు. అసెంబ్లీ అధ్యక్షుడు వాహబ్, పట్టణ అధ్యక్షుడు గాయస్, వైస్ ప్రెసిడెంట్ బబ్బు, ప్రధాన కార్యదర్శిలు శివ, సాయి ప్రతాప్, శ్రీకాంత్, అనిల్, కరుణాకర్, అజ్జు యాదవ్, జ్ఞానేశ్, నగేశ్, దాసు, అజ్మత్, వంశీ, పవన్ పాల్గొన్నారు.

220 కిలోల గంజాయి పట్టివేత

- సుమారు రూ.55 లక్షల విలువ
- ఒకరు రిమాండ్, పరారీలో ఇద్దరు


వివరాలు వెల్లడిస్తున్న హరికిషన్

పటాన్ చెరు టౌన్: అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన పటాన్‌చెరులో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. శుక్రవారం మెదక్ డివిజన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హరికిషన్ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పటాన్‌చెరు మండలం ముత్తంగి టోల్ ప్లాజా సమీపంలో గురువారం అర్ధరాత్రి ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా వాహన తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఆంధ్రలోని ఒరిస్సా నుంచి మహారాష్ట్రకు చెందిన చంద్రకాంత్ కారే సొంత రాష్ట్రానికి 220 కిలోల గంజాయిని కారులో తరలిస్తుండగా పట్టుకున్నారు. మరో ఇద్దరు విశాల్ దిలీప్, అమర్ సంజయ్ పరారుకాగా, చంద్రకాంత్‌ను రిమాండ్‌కు తరలించారు. గంజాయి విలువ సుమారు రూ.55 లక్షలు ఉంటుందని హరికిషన్ పేర్కొన్నారు.


రామచంద్రాపురం(పటాన్‌చెరు): గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని శ్రీకాకుళంకు చెందిన రాజు పటాన్‌చెరు పారిశ్రామిక వాడలోని ఓ పరిశ్రమలో కార్మికుడిగా పని చేసే సమయంలో పటాన్‌చెరుకు చెందిన ఫిరోజ్‌తో పరిచయం ఏర్పడింది. రాజు పని మానేసి శ్రీకాకుళం వెళ్లిపోగా, ఫిరోజ్‌కి డబ్బులు అవసరం కావడంతో రాజుకు ఫోన్ చేశాడు. తన వద్ద లేవని, గంజాయి వ్యాపారం చేస్తున్నానని కావాలంటే గంజాయి పంపిస్తా అమ్ముకోమని చెప్పాడు. అందుకు ఫిరోజ్ ఒప్పుకొని తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్ రింగ్‌రోడ్డు వద్ద గురువారం రాత్రి గంజాయిని విక్రయిస్తుండగా కొల్లూర్ పోలీసులు పట్టుకున్నారు. అతడి వద్ద 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

దూసుకొచ్చిన మృత్యువు

- బైక్‌ను ఢీకొట్టిన లారీ
- ఇద్దరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

తొగుట(దుబ్బాక): బతుకుదెరువు కోసం పొట్ట చేత పట్టుకొని వచ్చిన వలస కార్మికుల జీవితాలను రోడ్డు ప్రమాదం చిదిమేసింది. బైక్‌ను లారీ ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందగా మరొకరికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. తొగుట ఎస్ఐ లింగం కథనం మేరకు.. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అజయ్ కుమార్ (22), విద్యాసాగర్ (22), సచిన్ కుమార్ (19) కొంతకాలంగా మల్లన్న సాగర్ నిర్మాణ సంస్థ అయిన కేఎస్ఆర్‌లో సెక్యూరిటీ గార్డులుగా పని చేస్తున్నారు. ఉదయం డ్యూటీ ముగించుకొని తొగుటకు బైక్ పై వస్తున్నారు. ఈ క్రమంలో గజ్వేల్ నుంచి సిద్దిపేట వైపునకు ఓ లారీ వస్తోంది. తొగుట శివారులోని మలుపు వద్ద లారీ వేగంగా వచ్చి వీరి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అజయ్ కుమార్, విద్యాసాగర్ అక్కడికక్కడే మృతి చెందారు. సచిన్ కుమార్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం సచిన్ కుమార్‌ను హైదరాబాద్‌కు తరలించారు. మృతుడు విద్యాసాగర్ తమ్ముడు పంకజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ లింగం వివరించారు.

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణానికి చెందిన వెల్దండి శ్రీనివాస్(52) శుక్రవారం రాత్రి ఇంటికి బైక్‌పై వెళ్తుండగా మల్లెచెట్టు చౌరస్తాలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. కాలుపై లారీ వెళ్లడంతో కాలు నుజ్జు నుజ్జు అయ్యింది.


తొగుట(దుబ్బాక): ప్రమాదానికి కారణమైన లారీ, పక్కన అజయ్ కుమార్, విద్యాసాగర్ మృతదేహాలు

బొలేరో వాహనం బోల్తా..

రామాయంపేట(మెదక్): రామాయంపేట మండలం అక్కన్నపేట వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కామారెడ్డి జిల్లాకు చెందిన వ్యక్తి మృతి చెందాడు. కామారెడ్డి పట్టణానికి చెందిన షేక్ పీర్‌బాషా (54) బొలేరో వాహనంలో సంగారెడ్డి నుంచి కామారెడ్డికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో వేగంగా, నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడంతో బోల్తా పడింది. తలకు తీవ్ర గాయాలై మృతి చెందాడు.

అప్పుల బాధతో ముగ్గురు ఆత్మహత్య


సురేశ్ మృతదేహం

చిన్నశంకరంపేట(మెదక్): ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నార్సింగి మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ అమ్మద్ మోహినోద్దీన్ కథనం మేరకు.. నార్సింగి ఎస్సీ కాలనీకి చెందిన చీగుల్లపల్లి సురేశ్(32) కూలీ పనులు చేసుకొని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అప్పుల బాధతోపాటు కుటుంబ పోషణ భారమై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య మౌనిక, పదేళ్లలోపు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేశారు.

తొగుట(దుబ్బాక): అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. తొగుట ఎస్ఐ లింగం కథనం ప్రకారం..తొగుట గ్రామానికి చెందిన చింత కుమార్ (39) కొన్నేళ్ల కిందట అప్పులు చేసి వరికోత మిషన్, డీసీఎం కొనుగోలు చేశాడు. అవి సరిగా నడవకపోవడంతో అప్పులు తీర్చేందుకు అమ్మేశాడు. అప్పులు వడ్డీ కలిపి రూ.30 లక్షల వరకు అయ్యాయి. ఇంటి స్థలాన్ని విక్రయించి అప్పులు చెల్లించినా తీరకపోవడంతో మనస్తాపానికి గురై గురువారం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. రాత్రి వరకు రాకపోవడంతో గ్రామంలో వెతికినా జాడ లభించలేదు. శుక్రవారం ఉదయం గ్రామ శివారులోని పోతరాజు చెరువు కట్టపై పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం పొలాలకు వెళ్లే రైతులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లింగం వివరించారు.

మద్యానికి బానిసై..

మద్యానికి బానిసైన వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని ఉప్పరపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన చెంగర్ల కుమార్ (44) ఏడాది కిందట రూ.3 లక్షలు అప్పు చేసి కూతురు వివాహం చేశాడు. అప్పులు తీర్చేమార్గం కనిపించకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురై మద్యానికి బానిసయ్యాడు. గురువారం రాత్రి మద్యం సేవించి ఇంటికొచ్చాడు. తాగి ఎందుకు వచ్చావంటూ భార్య మందలించడంతో అదే రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఉదయం జంగాపల్లి రోడ్డు వద్ద చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ తెలిపారు.